సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 9 । మే । 2023



చీనీ టన్ను రూ.39 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.39 వేలు పలికాయి. మార్కెట్‌కు 759 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



యువకుడి దారుణ హత్య
పెట్రోలు బంకులో నెలకొన్న వివాదం ఓ యువకుడి హత్యకు దారి తీసింది. హతుడు తనకల్లు మండలం కోటూరు వాసిగా పోలీసులు గుర్తించారు. 8లో

గరిష్టం/కనిష్టం
$37.2^{\circ}/22.4^{\circ}$

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగానే ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'సూక్ష్మ' పరికరాలకు దరఖాస్తు చేసుకోండి



పుట్టపర్తి అర్బన్: బోరుబావులున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై సూక్ష్మ సేద్యపు పరికరాలు అందజేస్తోందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూక్ష్మ సేద్యం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రిప్ కోసం దరఖాస్తు చేసే రైతులకు ఐదు ఎకరాల్లోపు భూమి ఉంటే 90 శాతం, 5 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకూ భూమి ఉంటే 75 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసే రైతులు 5 ఎకరాల వరకూ విస్తీర్ణం ఉంటే 55 శాతం సబ్సిడీ, 5 నుంచి 12.5 ఎకరాల వరకూ భూమి ఉంటే 45 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. 2023–24 సంవత్సరానికి 10 వేల ఎకరాలకు సూక్ష్మ పరికరాలు ఇవ్వాలని లక్ష్యం విధించుకున్నామన్నారు. అర్హులు ఆధార్, వన్‌బీ, ఎఫ్‌ఎంబీ, చెక్కుబంది, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్సులతో సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

13 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా వరుణుడి ప్రతాపం కొనసాగుతోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 13 మండలాల పరిధిలో స్వల్ప వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కనగానపల్లిలో 41.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే రామగిరిలో 29.2 మి.మీ, చెన్నేకొత్తపల్లిలో 25.8, గోరంట్లలో 15.2, సోమందేపల్లిలో 10.2, రొద్దం 9.8, ధర్మవరం 5.6, పెనుకొండ 4.2, లేపాక్షి 4 మి.మీ వర్షపాతం నమోదైంది. తాజా వర్షాలతో బోరుబావుల కింద ముందస్తుగా వేరుశనగ సాగుకు, వేసవి దుక్కులకు అనుకూలంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు.

మండల ప్రత్యేకాధికారుల నియామకం



అగళి ప్రత్యేకాధికారి చంద్రశేఖర్



పెనుకొండ ప్రత్యేకాధికారి పద్మమ్మ

పుట్టపర్తి అర్బన్: సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేయడానికి జిల్లాలోని 32 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగళి మండలానికి జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, అమడగూరు మండలానికి ఫిషరీస్ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, అమరాపురం మండలానికి జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, బత్తలపల్లి మండలానికి డీఎస్ఎల్ఓ రామకృష్ణ, బుక్కపట్నం మండలానికి భూగర్భజలశాఖ ఏడీ రాజశేఖరరెడ్డి, చెన్నేకొత్తపల్లికి జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, చిలమత్తూరుకు జిల్లా వాటర్ సప్లై అధికారి రాజశేఖరరెడ్డి, ధర్మవరానికి పరిశ్రమల శాఖ జేడీ చాంద్‌బాషా, గాండ్లపెంటకు డీటీడబ్ల్యూఓ మోహన్‌రామ్‌ను నియమించారు. అలాగే గోరంట్లకు డీపీఓ విజయ్‌కుమార్, గుడిబండకు ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ మోసెస్, హిందూపురానికి హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, కదిరికి జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, కనగానపల్లికి నోడలాఫీసర్ శివారెడ్డి, కొత్తచెరువుకు జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి శివరంగప్రసాద్, లేపాక్షికి ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, మడకశిరకు జిల్లా కోఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్, ముదిగుబ్బకు ఈఈ సంజప్ప, నల్లచెరువుకు లేబర్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, నల్లమాడకు బీసీ వెల్ఫేర్ డీడీ నిర్మలాజ్యోతిని నియమించారు. అలాగే ఎన్‌పీకుంటకు జిల్లా వాటర్ రిసోర్స్ అధికారి గంగాధర్, ఓడీసీ మండలానికి హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్, పెనుకొండకు సెరికల్చర్ జేడీ పద్మమ్మ, పుట్టపర్తికి డీఎఫ్ఓ రవీంద్రరెడ్డి, రామగిరికి ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య, రొద్దంకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, రొళ్లకు మైన్స్ ఏడీ రామ్మోహన్‌రావు, సోమందేపల్లికి పౌరసరఫరాల శాఖ డీఎం అశ్వర్థనారాయణనాయక్, తాడిమర్రికి డ్వామా పీడీ రామాంజనేయులు, తలుపులకు దేవదాయశాఖ ఏసీ మల్లికార్జునరెడ్డి, తనకల్లు మండలానికి పశుసంవర్ధకశాఖ జేడీ శుభదాస్‌ను నియమించారు.

పశు సంపదలో టాప్

- ఉమ్మడి అనంత జిల్లాలో భారీగా పశు సంపద
- మేకలు, గొర్రెల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- కొన్నేళ్లుగా పాల ఉత్పత్తి కోసం పెరిగిన ఆవుల పెంపకం
- మాంసాహార ఉత్పత్తుల ఎగుమతులతో భారీ ఆదాయం



సాక్షి ప్రతినిధి, అనంతపురం : అనంతపురం జిల్లా పేరుచెబితే చాలామందికి ఉద్యానపంటలు గుర్తుకు వస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ మొదలుకొని అంజూర్ వరకు అన్నీ ఇక్కడే లభిస్తాయన్న నమ్మకం. ఇక చీనీకి ఆసియా ఖండంలో అతిపెద్ద మార్కెట్ కలిగి ఉన్నది అనంతపురం జిల్లాలోనే అన్న సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా ఉద్యాన పంటలకే కాదు పశు సంపదకూ ఇప్పుడు పెట్టింది పేరు. రాష్ట్రంలోనే పశు సంపద ఎక్కువగా ఉన్న జిల్లాగా ఉమ్మడి అనంతపురం ముందంజలో ఉంది.

పొట్టేళ్లు, మేకల ఉత్పత్తిలో మేటి..

పొట్టేళ్లు, మేకల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు టాప్‌లో నిలిచాయి. ఇక్కడ ఉత్పత్తి అవుతున్నంతగా వేరే ఏ జిల్లాలోనూ లేవు. ఇక్కడి పశుసంపద వేలాదిమందికి జీవనోపాధి ఇస్తుండగా, మాంసాహార అమ్మకాల్లో లక్షలాదిమందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉత్పత్తయ్యే మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు రాష్ట్రమంతటా సరఫరా అవుతున్నాయి.

మాంసం ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ..

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మాంసం ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మేకలు, గొర్రెల మాంసం ఎగుమతి అవుతోంది. రోజూ కోట్లాది రూపాయల లావాదేవీలు ఈ మాంసం విక్రయాల ద్వారా జరుగుతున్నాయి. చాలా కుటుంబాలకు పాలు ఆధారం కావడంతో ఇప్పుడు రెండు జిల్లాల్లోనూ ఆవుల పెంపకం ఎక్కువగా ఉంది.

చిట్టడవులే మూలం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువగా మెట్టభూములు ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు పశువులకు బలవర్ధకమైన ఆహారం ఇక్కడ ఉత్పత్తి అవుతోంది. దీనికితోడు జిల్లాలో 2.20 లక్షల హెక్టార్లలో చిట్టడవులు వ్యాపించి ఉన్నాయి. 67 రకాల అసాధారణ గడ్డి ఇక్కడ ఉత్పత్తి అవుతోంది. ఇలాంటి పోషకాలతో కూడిన గడ్డి ఎక్కడా లేదని ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్లు నిర్ధారించారు. ఈ గడ్డి ఇక్కడి పశువుల ఎదుగుదలకు మంచి తోడ్పాటునందిస్తున్నట్టు చెబుతున్నారు.

అనంతపురం జిల్లాలో పశుసంపద ఇలా

కేటగిరీ	2019 సంవత్సరంలో	2022లో అంచనా
ఆవులు	2,15,896	277646
గేదెలు	1,89,843	2,15,414
గొర్రెలు	22,97,300	24,78,991
మేకలు	4,12,094	5,00,612
పందులు	8,164	9,780
కోళ్లు	10,36,657	12,71,663

శ్రీసత్యసాయి జిల్లాలో పశు సంపద ఇలా

కేటగిరీ	2019 సంవత్సరం	2022లో అంచనా
ఆవులు	2,81,206	347231
గేదెలు	96,500	1,21,907
గొర్రెలు	26,29,287	27,49,823
మేకలు	4,72,092	5,16,232
పందులు	4,603	5,213
కోళ్లు	14,86,918	15,12,784

ఏటా రూ.6 లక్షలకు పైగా ఆదాయం



30 ఏళ్లకు పైగా గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాం. ఇదే మాకు ప్రధానమైన వృత్తి. ప్రస్తుతం 300కు పైగా గొర్రెలున్నాయి. ఏటా రెండుసార్లు పొట్టేళ్లను విక్రయించడం ద్వారా దాదాపు రూ.6లక్షలకు పైగా ఆదాయం వస్తోంది.

– ఉజ్జినప్ప, గొర్రెల కాపరి, బొమ్మేపర్తి, రాప్తాడు మండలం

ప్రతిఫలంతోపాటు కష్టమూ ఎక్కువే



గొర్రెల పెంపకంలో ప్రతిఫలంతోపాటుగానే కష్టం సైతం అధికంగా ఉంటుంది. గొర్రెల మేపు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లడంతో పాటు గాలి, వానలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. మాకు 700కు పైగా గొర్రెలు ఉన్నాయి. వీటితో ఏడాదికి రూ.15 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది.

– బ్యాళ్ల రవి, కొడిమి, అనంతపురం రూరల్ మండలం

అనుకూలమైన ప్రాంతం కావడం వల్లే..



గొర్రెలు, మేకలు ఇతర ఏ పశువులకైనా ఉమ్మడి అనంతపురం జిల్లా అనుకూలమైన ప్రాంతం. పొడి నేలలు, చిట్టడవులు ఎక్కువగా ఉండటం పశువుల పోషణకు సానుకూలం. దీనికితోడు జిల్లాలో బీసీలు ఎక్కువగా ఉండటంలో వృత్తి రీత్యా కూడా మేకలు, గొర్రెలు పెంపకం ఎక్కువగా ఉంది. మంచి ఆదాయ వనరుగా కూడా జీవాల పెంపకం ఉంది.

–డా. సుబ్రమణ్యం, సంయుక్త సంచాలకులు, పశు సంవర్ధకశాఖ

10న పాలీసెట్

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- హిందూపురంలో ఏడు కేంద్రాలు



హిందూపురం: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'పాలీసెట్–2023'ను ఈనెల 10వ తేదీన (బుధవారం) నిర్వహించనున్నట్లు పాలీసెట్ హిందూపురం కోఆర్డినేటర్ ఎస్.హరీష్ బాబు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ టి.శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష ఉంటుందన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు.

హిందూపురంలో మొత్తం 2,555 మంది పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థుల కోసం శ్రీ బాలాజీ విద్యా విహార్ డిగ్రీ కళాశాల, సప్తగిరి డిగ్రీ కళాశాల, బాలయేసు డిగ్రీ కళాశాల, బాలయేసు జూనియర్ కళాశాల, ఎంజీఎం హైస్కూల్, ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్‌డీజీఎస్ డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, హెచ్‌బీ/2హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్ వెంట తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్‌తో సహా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలేవీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు.

హాల్‌టికెట్ జనరేట్ కాకపోతే...

పాలీసెట్ పరీక్షకు దరఖాస్తు చేసినా హాల్ టికెట్ జనరేట్ కాని అభ్యర్థులు 10వ తేదీ ఉదయం 9 గంటలకు హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ కోఆర్డినేటర్‌ను సంప్రదించి సూచించారు. హాల్ టికెట్ పొందడానికి పాలీసెట్ అప్లికేషన్, రెండు ఫొటోలు, ఆధార్ కార్డు, ఫీజు కింద ఓసి/బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

తాళి కట్టాడు.. ఆపై వెళ్లగొట్టాడు

నా భర్తే నన్ను టార్చర్ చేశాడు

- మరో మహిళను వివాహం చేసుకునేందుకు ప్లాన్ చేశాడు
- ఆదుకోవాల్సిన అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు
- 'స్పందన'లో ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళ



ఎస్పీ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న బాధితురాలు గాయత్రి

కొత్తచెరువు: గొప్ప సంబంధం అనుకుని తల్లిదండ్రులు కట్నకానుకలిచ్చి ఘనంగా పెళ్లి చేస్తే... భర్త అమెరికాకు వెళ్లిపోగా, అత్తారింటి వారు అదనపు కట్నం కోసం ఆమెను వేధింపులకు గురి చేశారు. దీంతో బాధితురాలు సోమవారం 'స్పందన'లో ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఎదుట తన గోడు వెళ్లబోసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరం ఎన్టీఆర్ సర్కిల్‌లో నివాసముంటున్న గాయత్రికి 2016లో ఉరవకొండకు చెందిన నాగేశ్వర్‌శెట్టి కుమారుడు ప్రశాంత్‌కుమార్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నం కింద గాయత్రి తల్లిదండ్రులు రూ.5 లక్షల నగదు, 20 తులాల బంగారం, ఒకటిన్నర కిలోల వెండి ఇచ్చారు. పెళ్లి తర్వాత కొద్దిరోజులకు తీసుకెళ్తానని గాయత్రికి చెప్పి అమెరికా వెళ్లాడు. దీంతో గాయత్రి అత్తగారింట్లో ఉండేది. ఈ క్రమంలో అత్త పద్మావతి, ఆడపడచు ఉష అదనపు కట్నం కోసం రోజూ ఆమెను వేధించేవారు. ఆ వేధింపులు తట్టుకోలేక విషయం పుట్టింటి వారికి చెప్పడంతో మళ్లీ రూ.2 లక్షలు అదనంగా ఇచ్చారు. అయినా సంతృప్తి చెందని వారు రోజూ ఆమెను వేధించేవారు. ఈసమయంలోనే ప్రశాంత్ అమెరికాకు రమ్మని చెప్పడంతో గాయత్రి ఒంటరిగా వెళ్లింది. అక్కడ ప్రశాంత్ వేరొక మహిళతో సంబంధం పెట్టుకున్న విషయం గమనించి ప్రశ్నించింది. తాను మరో మహిళను పెళ్లి చేసుకుంటానని, అందుకు ఒప్పుకోవాలంటూ ప్రశాంత్ తన భార్య గాయత్రిని టార్చర్ చేశాడు. దీంతో గాయత్రి విషయం తల్లిదండ్రులకు తెలిపి వారి సూచన మేరకు అమెరికా నుంచి వచ్చి అత్తగారింటికి వెళ్లింది. కానీ అత్త, ఆడపడచులు ఆమెను వేధించడం మొదలెట్టారు. దీంతో మానసికంగా కుంగిపోయిన గాయత్రి అనారోగ్యం పాలైంది. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా వారిలో మార్పు రాలేదు. దీంతో బాధితురాలు సోమవారం 'స్పందన'కు వచ్చి తన గోడు వెళ్లబోసుకుంది. తన భర్త, అత్త, ఆడపడచులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరింది. ఇలా పోలీసు స్పందనలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 52 అర్జీలు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి ప్రతి అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రామకృష్ణ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

- 'స్పందన'లో జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'స్పందన' కార్యక్రమంలో అందే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 221 అర్జీలు అందగా, కొన్నింటిపై అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం డివిజన్, మండల స్థాయి అధికారులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్పందనలో అర్జీ సమర్పించిన వారితో తానే స్వయంగా ఫోన్లో మాట్లాడానని, చాలామంది అర్జీదారులు తమకు అధికారులు సంతృప్తికర పరిష్కారం చూపించలేదని సమాధానం ఇచ్చారన్నారు. ఎక్కువగా రెవెన్యూ, హౌసింగ్, సర్వే, పంచాయతీరాజ్, అగ్రికల్చర్ తదితర శాఖలకు చెందిన సమస్యలు ఉన్నాయన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలి..

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ చేతన్ ఆదేశించారు. 'స్పందన' కార్యక్రమం అనంతరం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణకు అన్ని మండలాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించామన్నారు. వీరు ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. స్పెషలాఫీసర్లకు సంబంధించి వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేస్తామని, ఆయా మండలాల్లో ఎదురవుతున్న సమస్యను తెలిపితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ఎస్ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, ఏడీ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్ ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, డ్వామా పీడీ రామాంజనేయులు, డీహెచ్ఓ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

స్పందనకు వచ్చిన అర్జీల్లో కొన్ని...



- 9 ఏళ్ల వయస్సున్న తన కుమారుడు అవేజుల్ అర్హాన్ నడవలేడు, మాట్లాడలేడని, కనీసం కూర్చో లేడని లేపాక్షికి చెందిన సయ్యద్ అహ్మద్ జాయింట్ కలెక్టర్‌కు తెలిపారు. వైద్యం కోసం చాలా వెచ్చించాల్సి వస్తోందన్నారు. పిల్లాడికి ఇస్తున్న పింఛన్ మొత్తాన్ని రూ.5 వేలకు పెంచి ఇప్పించాలని కోరారు.



- సాంకేతిక కారణాలతో నాలుగేళ్లుగా తనకు పంట నష్ట పరిహారం అందడం లేదని, ఎవరిని అడిగినా స్పందించడం లేదని తాడిమర్రి మండలం పత్రపల్లికి చెందిన సంజీవప్ప జేసీకి విన్నవించారు. సచివాలయంలో అడిగినా, మండలాఫీస్‌లో అడిగినా సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. 20 ఎకరాల్లో పంటలు సాగు చేసి తీవ్రంగా నష్ట పోయామన్నారు. ఇప్పటికైనా తనకు పంట నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

పాఠానికి ముందే పుస్తకం

- బడి తెరిచిన రోజే పాఠ్య పుస్తకాల పంపిణీ
- జిల్లా నుంచి 7.20 లక్షల పుస్తకాలకు ఇండెంట్
- ఇప్పటికే 1.35 లక్షల పుస్తకాలు జిల్లాకు చేరిన వైనం



కదిరి స్టాక్ పాయింట్‌లో పాఠ్యపుస్తకాలు

కదిరి: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్ సర్కార్... విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తోంది. గతానికి భిన్నంగా పాఠశాలల పునఃప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు, 'జగనన్న విద్యాకానుక' పేరుతో నోటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు షూ, బెల్ట్ తదితర వాటితో అందించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో తొలుత పాఠ్యపుస్తకాల పంపిణీపై దృష్టి సారించింది. వేసవి సెలవుల్లోనే ఆయా మండల కేంద్రాలకు పాఠ్యపుస్తకాలను చేరవేస్తోంది. జిల్లాకు 7.20 లక్షల పాఠ్యపుస్తకాలు కావాల్సి ఉండగా, ఇప్పటికే 1.35 లక్షల పుస్తకాలు గోదాములకు చేరాయి.

సెమిస్టర్ వారీగా పుస్తకాలు..

విద్యార్థికి పుస్తకాల మోత తగ్గించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే రెండు సెమిస్టర్లుగా పాఠ్య పుస్తకాలు ముద్రిస్తున్నారు. మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన పుస్తకాలను దశలవారీగా మండల కేంద్రాల్లోని గోదాములకు చేరుస్తోంది. ఇప్పటికే పలు మండలాలకు వివిధ పుస్తకాలు చేరాయి. ప్రభుత్వం అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలను ద్విభాషా(బైలింగ్యువల్) విధానంలో ముద్రించారు.


ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు..

2022–23 విద్యాసంవత్సరంలోనే 8వ తరగతికి ఎన్‌సీఈఆర్‌టీ (జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి) రూపొందించిన పాఠ్యపుస్తకాలను ప్రవేశ పెట్టారు. వచ్చే విద్యాసంవత్సరం (2023–24)లో 6,7 తరగతులకు కూడా ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సబ్జెక్టులకు ఎన్‌సీఈఆర్‌టీ కరిక్యులమ్‌తో కూడిన పాఠ్య పుస్తకాలను అందిస్తారు. తెలుగు, హిందీ, సోషియల్ సబ్జెక్టులకు మాత్రం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి పుస్తకాలు పంపిణీ చేస్తారు. అలాగే 8, 9వ తరగతులకు ఆంగ్లం, గణితం, సైన్స్‌తో పాటు సోషియల్ సబ్జెక్ట్ కూడా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలుంటాయి. అయితే 10వ తరగతి విద్యార్థులకు మాత్రం రానున్న విద్యా సంవత్సరం(2023–24)లోనూ ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పుస్తకాలనే అందజేస్తారు.

జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

పాఠశాల స్థాయి	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,553	51,330
ప్రాథమికోన్నత	230	20,1125
ఉన్నత	306	89,888
మొత్తం	2,089	1,61,343

ప్రభుత్వం ముందుచూపుతో ఉంది



గతంలో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు విద్యాసంవత్సరం ముగిసే వరకూ వస్తూనే ఉండేవి. కానీ ఈ ప్రభుత్వం విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. పాఠ్యపుస్తకాలు అప్పుడే స్టాక్‌పాయింట్లకు చేరుకున్నాయంటే ప్రభుత్వం ఎంత ముందుచూపుతో ఉందో అర్థం చేసుకోవచ్చు.

– సి.గంగాధర్, టీచర్, ఎన్‌పీకుంట

స్కూళ్లు తెరిచే నాటికి పుస్తకాలు



పాఠశాలల పునఃప్రారంభం నాటికి పిల్లలకు కొత్త పాఠ్యపుస్తకాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే రోజే జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కూడా ఉంటుంది. ఇప్పటికే కొన్ని పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. దశల వారీగా పంపుతున్నారు.

– మీనాక్షి, డీఈఓ

రేపు పెన్షన్ అదాలత్

అనంతపురం సిటీ: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు కడప రీజియన్ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్(పెన్షన్) ప్రేమలత తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈపీఎస్–1995 నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు ఫిర్యాదులను పరిష్కరించడానికి వీలుగా ఆ రోజు ఉదయం 11 గంటలకు 'వెబెక్స్' వేదికగా అదాలత్ నిర్వహించనున్నట్లు వివరించారు. పెన్షనర్లు, రానున్న మూడు నెలల్లో పెన్షనర్లు కానున్న ఈపీఎస్ సభ్యులు పెన్షన్ అదాలత్‌లో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన లింక్ ఇలా..
https://meetingsapac.19.webex.com/meetingsapac19/j.php?MTID=meed056a25cce0527b548679d479e180
మీటింగ్ నెంబర్: 2643 344 0966, పాస్‌వర్డ్: 1234, తేదీ: 10.05.2023, సమయం ఉదయం 11 గంటలు.

క్లుప్తంగా

డీఎడ్ ప్రైవేట్ కళాశాలల రెన్యూవల్‌కు అవకాశం

పుట్టపర్తి: ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి డీఎడ్ ప్రైవేట్ కళాశాలల రెన్యూవల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. త్వరలో డీఎడ్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనున్న నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ లోపు ప్రైవేట్ కళాశాలల రెన్యూవల్‌ను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పీఏబీఆర్ కుడికాలువ గేట్ల మూసివేత

కూడేరు: పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటి విడుదలను ఇరిగేషన్ అధికారులు నిలిపి వేశారు. ఈ మేరకు రిజర్వాయర్ జేఈ లక్ష్మీదేవి సోమవారం తెలిపారు. కుడి కాలువకు కొన్ని నెలల పాటు నీటిని సరఫరా చేయడంతో 10వ కిలోమీటర్ వద్ద కాలువకు ఇరువైపులా నీరు ఊరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నట్లు కొందరు రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించిన అధికారులు నీటి సరఫరాని నిలిపి వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 8 నెలల పాటు మొత్తం 6 టీఎంసీల నీటిని కుడి కాలువకు విడుదల చేశారు.

యువకుడి దారుణహత్య

- రోడ్డు పక్కన చెట్ల పొదల్లో మృతదేహం
- హతుడు తనకల్లు వాసి



అక్రమ్ (ఫైల్)

మదనపల్లె: ఓ పెట్రోలు బంకులో నెలకొన్న వివాదంతో క్షణికావేశానికి గురైన యువకులు, మరో యువకుడిపై ఇనుపరాడ్డుతో దాడి చేసి హతమార్చారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కోటూరుకు చెందిన పఠాన్ మౌలాలీ కుమారుడు పఠాన్ అక్రమ్ (24), మదనపల్లెలోని నక్కలదిన్నెలో నివాసముంటున్న బంధువులు ఖాదర్‌వల్లీ, షబానా ఇంట్లో ఉంటున్నాడు. అక్కడే ఓ వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అక్రమ్, వెల్డింగ్‌షాపు నిర్వాహకుడు ఖాదర్‌వలి, నక్కలదిన్నెకు చెందిన వాటర్‌మ్యాన్ సుధాకర్, కార్పెంటర్ బషీర్, టెంపో డ్రైవర్ రెడ్డిబాషా కలసి చిప్పిలికి చెందిన వీరేంద్రప్రసాద్ ఆటోలో కర్ణాటకలోని రాయల్‌పాడుకు మద్యం తాగేందుకు వెళ్లారు.



పఠాన్ అక్రమ్ మృతదేహం

రసీదు విషయంలో ఘర్షణ..

మద్యం మత్తులో తిరుగు ప్రయాణమైన ఆరుగురు నేరుగా కర్ణాటక సరిహద్దులోని ఓ పెట్రోలు బంకులో ఆటోకు డీజిల్ పట్టించేందుకు వెళ్లారు. డబ్బు చెల్లించిన అనంతరం బిల్లును బంకు నిర్వాహకులు ఇవ్వకపోవడంతో అక్రమ్, రెడ్డిబాషా గట్టిగా నిలదీశారు. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. అదే సమయంలో ఏపీ21 ఏఎస్5483 నంబరు గల కారులో అక్కడికి డీజిల్ పట్టుకునేందుకు వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన వారిగా చెబుతున్న ముగ్గురు వ్యక్తులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు.

కారులో వెంబడించి...

ముగ్గురు వ్యక్తుల జోక్యంతో పెట్రోలు బంకులో వివాదం సద్దుమణిగినా.. మద్యం మత్తులో ఉన్న అక్రమ్, రెడ్డిబాషా.. కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులపై వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో ఆవేశంతో అక్రమ్, రెడ్డి బాషాపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. స్థానికంగా ఉన్నవారు సర్ది చెప్పడంతో ఆరుగురు ఆటోలో మదనపల్లెకు బయలుదేరారు. అయితే ఘర్షణతో అహం దెబ్బతిన్న ముగ్గురు వ్యక్తులు తమ కారుతో ఆటోను వెంబడించారు. ఆంధ్ర – కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చీకలబైలు వద్దకు చేరుకోగానే ఆటోను అడ్డుకుని రెడ్డి బాషాపై మూకుమ్మడిగా దాడి చేశారు. అక్రమ్ మర్మాంగంపై తన్నడంతో వారి నుంచి తప్పించుకుని పారిపోయాడు. వెంటాడిన ముగ్గురు వ్యక్తులు ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టి, ఉడాయించారు. తలకు తీవ్ర గాయమైన అక్రమ్.. వేంపల్లె పంచాయతీ కూకటి మానుగడ్డ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ముల్ల పొదల్లో పడి మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న వ్యక్తుల అక్రమ్ పారిపోయి ఇంటికి చేరుకుని ఉంటాడని భావించి మదనపల్లెకు చేరుకున్నారు.

రాత్రంతా గాలింపు..

స్నేహితులందరూ కలసి అక్రమ్ ఇంటి వద్దకెళ్లి జరిగిన ఘటన తెలిపి, అక్రమ్ గురించి ఆరా తీశారు. అయితే అతను ఇంటికి చేరుకోలేదని తెలుసుకుని ఖాదర్‌వలితో కలసి రాత్రంతా గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లక్ష్యం కాలేదు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన వారికి రోడ్డు పక్కన పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో డీఎస్పీ కేశప్ప, తాలూకా సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ మురళీకృష్ణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడిని అక్రమ్‌గా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని ధ్రువీకరించారు. అక్రమ్‌తో పాటు వెళ్లిన ఖాదర్‌వలి, రెడ్డిబాషా, బషీర్, సుధాకర్, వీరేంద్రప్రసాద్ అక్కడికి చేరుకోవడంతో ఘటనకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. హత్యకు సంబంధించి ఐదుగురిని విచారించి వారి నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ తీసుకున్నారు. కారు ఫొటో, వాహనం నంబరు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా హత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణలో అక్రమ్‌తో వెళ్లిన వారు పొంతన లేని సమాధానాలు చెబుతుండటమే ఇందుకు నిదర్శమని పోలీసులు పేర్కొంటున్నారు. మద్యం మత్తులో వారిలో వారే గొడవపడి హత్య చేశారా.. లేక పులివెందులవాసులు హత్యకు పాల్పడ్డారా.. అనే విషయాలు తేలాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ముదిగుబ్బ: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం పందులకుంట గ్రామానికి చెందిన అంజి (38)కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ముదిగుబ్బలో ఓ ఇంటికి వైరింగ్ పని పూర్తి చేసేందుకు ఒప్పందం చేసుకున్న అంజి.. సోమవారం పనిలో నిమగ్నమై ఉండగా.. విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైలు నుంచి కిందపడి వ్యక్తి ..

హిందూపురం: రైలు నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. హిందూపురం రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని దేవరపల్లి స్టేషన్ సమీపంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడికి 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని రైల్వే హెచ్‌సీ ఎర్రిస్వామి తెలిపారు. ముఖానికి బలమైన గాయం కావడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. 5.5 ఎత్తు, నలుపు రంగు, నలుపు తెలుపు కలగలసిన తల వెంట్రుకలు, జీన్స్ వైట్‌కలర్ ఫుల్ షర్టు, నలుపు రంగు నైట్‌ప్యాంటుతో పాటు మెడలో పసుపు దారములున్నాయన్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 94412 38182, 94406 27641కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యానికి బానిసై చేనేత కార్మికుడి మృతి



శంకరయ్య మృతదేహం

మదనపల్లె: మద్యానికి బానిసై, అనారోగ్యం బారినపడి ఓ చేనేత కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో జరిగింది. హిందూపురానికి చెందిన బి.శంకరయ్య (43) కొంతకాలం క్రితం కుటుంబంతో కలిసి ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వలసవచ్చాడు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో అద్దె ఇంటిలో నివాసముంటూ చేనేత కార్మికునిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన శంకరయ్య కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల అతిగా మద్యం సేవించడంతో ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. కుటుంబ సభ్యులు బాధితున్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ మృతి చెందాడు.

రాష్ట్ర హాకీ జట్టులో ధర్మవరం క్రీడాకారులు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో హాకీ ఏపీ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకూ ఒడిశాలోని రూర్కెలాలో జరిగే 13వ జాతీయ సబ్ జూనియర్ బాలుర హాకీ చాంపియన్ టోర్నీలో పాల్గొనే ఏపీ జట్టులో ధర్మవరానికి చెందిన మహమ్మద్ బాషా, లోకేష్‌కు చోటు దక్కింది. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్ సోమవారం తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా హాకీ అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు బండి వేణుగోపాల్, కోచ్ హుసేన్, క్రీడాకారులు అభినందించారు.

పెళ్లి పేరుతో మోసం చేశాడు

హిందూపురం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఓ యువతి ఆశ్రయించింది. హిందూపురం వన్‌టౌన్ సీఐ ఈరన్న తెలిపిన మేరకు... హిందూపురంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన ఇర్ఫాన్‌కు ముంబయిలోని ముస్కాన్ సమీప బంధువు. ఎనిమిదేళ్లుగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో గత నెల వీరిద్దరికీ పెళ్లి చేయాలని నిశ్చయించుకుని వధువు తల్లిదండ్రులు ఇర్ఫాన్ కుటుంబసభ్యులకు విమాన టికెట్లు సైతం పంపారు. అయితే ఇర్ఫాన్ తన కుటుంబసభ్యుల మాట విని పెళ్లికి హాజరుకాలేదు. దీంతో ఆదివారం హిందూపురానికి ముస్కాన్, కుటుంబసభ్యులు చేరుకుని స్థానిక ఫిర్దోస్ మసీదులో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఆ సమయంలో రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం చెలరేగి గొడవపడ్డారు. పరస్పర దాడి చేసుకున్నారు. ఘటనపై ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిపించి పోలీసులు విచారణ చేశారు. ఆ సమయంలో తనను పెళ్లి పేరుతో ఇర్ఫాన్ మోసం చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పీహెచ్‌డీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎంవీ లక్ష్మయ్య సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యూజీసీ–నెట్, యూజీసీ–సీఎస్ఐఆర్, నెట్, గేట్‌లో అర్హత సాధించిన వారు అర్హులు. ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలి. పూర్తి వివరాలకు www.skuniversity.ac.inల వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

రామకృష్ణారెడ్డి హత్య కేసుపై సీబీఐ విచారణకు లేఖ

హిందూపురం: వైఎస్సార్‌సీపీ హిందూపురం మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి హత్య కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని ఈ కేసులో నిందితుడిగా ఉన్న గోపీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీబీఐ చీఫ్ డైరెక్టర్‌కు తపాలా, ఈ మెయిల్ ద్వారా లేఖ రాసినట్లు తెలిపారు. కొందరి ఒత్తిడితో తనను నిందితుడిగా ఇరికించారని, దీంతో నిజమైన దోషులు తప్పించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కేసును పూర్తి స్థాయిలో విచారణ చేయకుండానే పోలీసులు ముగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

గరుడ వాహనంపై లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం బ్రహ్మోత్సవాల్లో సోమవారం సాయంత్రం లక్ష్మీనారసింహుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవకు ముందుగా ఆలయంలో మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో నృసింహుని కల్యాణోత్సవం నిర్వహించారు.

బిహార్ వాసి దుర్మరణం

గుంతకల్లు రూరల్: రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీహార్‌లోని పాట్నా జిల్లా దుహువ గ్రామానికి చంఎదిన జితేందర్ (30), ప్రియాంకదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొంత కాలం క్రితం బతుకు తెరువు కోసం కుటుంబసభ్యులతో కలసి గుంతకల్లుకు వలస వచ్చిన జితేందర్... స్థానిక పారిశ్రామిక వాడ సమీపంలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. పారిశ్రామిక వాడలోని ఓ ఫ్యాక్టరీలో కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు హోటల్‌కెళ్లి భోజనం తీసుకుని తిరిగి విధులకు హాజరయ్యేందుకు వెళుతుండగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో జితేందర్ ఎగిరి రోడ్డుపక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా ఉడాయించాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న వాహనదారులు రోడ్డు పక్కన పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

గుత్తి: స్థానిక కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయుడు బనోత్ బాపూజీపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యాలయలో ఉపాధ్యాయురాలిని అకారణంగా దూషించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం బనోత్ బాపూజీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన తాయన్న

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి ఉత్తర్వుల మేరకు అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా తాయన్న.. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేస్తున్న మహబూబ్ అలీని డిప్యూటేషన్‌పై రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లుకు అక్కడ పనిచేస్తున్న తాయన్నను అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు.

పిడుగు పాటు... పాడిఆవు మృతి



యాడికి: పిడుగు పాటుకు గురై ఓ పాడి ఆవు మృతి చెందింది. యాడికి మండలం లక్షుంపల్లిలో సోమవారం వేకువ జాము 1.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో గ్రామానికి చెందిన రైతు పోస్టల్ రమణారెడ్డి పశువుల పాకపై పిడుగు రాలింది. ఘటనతో పాకలోని ఆవు మృతి చెందింది. దీంతో రూ.60 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

మల్బరీ సాగు లాభదాయకం



నుసికొట్టాలలో పట్టుగూళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీధర్

కళ్యాణదుర్గం: మల్బరీ సాగుతో మంచి ఆదాయం లభిస్తుందని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. సోమవారం చిత్తూరు హార్టికల్చర్ ప్లానింగ్ జేడీ ధర్మజ, అనంతపురం ఆత్మ పీడీ మద్దిలేటి, అనంతపురం సెరికల్చర్ అధికారి ఆంజనేయులుతో కలిసి కమిషనర్ కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాల, మల్లాపురం గ్రామాల్లో సాగు చేసిన మల్బరీ పంటలను పరిశీలించారు. నుసికొట్టాల రైతులు అనందరెడ్డి, జయచంద్రారెడ్డి మల్బరీ సాగులో అవలంబిస్తున్న ఆధునిక విధానాలపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. మల్లాపురం రైతు పరశురామప్ప పశువుల ఎరువులతో సాగు చేసిన పంటను పరిశీలించారు. మల్బరీ సాగు.. పట్టుగూళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని, రైతులు దీనిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఏడీలు ఉషా వర్ధిని, నవీన్, ఎస్ఓ బాబయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంబదూరు: ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్ సోమవారం కంబదూరులోని భీములకుంట రోడ్డు సమీపాన నిర్మిస్తున్న ఉద్యాన శాఖ కలెక్షన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కేజీబీవీ వెనుక ఉన్న వక్క ప్లేట్ల కేంద్రాన్ని పరిశీలించి.. తయారీ విధానంపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీ యల్లప్ప, ఏఓ జాఫర్, హార్టికల్చర్ అధికారి గౌసియా తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

కుందుర్పి: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన నాగభూషణప్ప (69)కు భార్య ముద్దక్క, ముగ్గురు కుమారులు ఉన్నారు. సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులోని బావి వద్దకు వెళ్లిన నాగభూషణప్ప ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి మృతిచెందాడు. విషయాన్ని గుర్తించిన పశువుల కాపర్ల సమాచారం మేరకు కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీసి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైల్వే సామగ్రి చోరీ కేసులో ఆర్పీఎఫ్ పురోగతి

అనంతపురం సిటీ: రైల్వేకు చెందిన విలువైన ఇనుప సామగ్రి చోరీ అయిన కేసులో ఆర్పీఎఫ్ మరింత పురోగతి సాధించింది. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు ఆరుగురు కూలీలను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. చోరీకి గురైన విలువైన ఇనుప కమ్మీలను కొనుగోలు చేసిన అనంతపురం పరిసర ప్రాంతాలకు చెందిన గుజరీ వ్యాపారులు ఎవరనేది గుర్తించారు. ఈ వ్యవహారంలో కొందరు వ్యాపారులను ఆర్పీఎఫ్ ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రేపోమాపో నిందితులు మీడియా ఎదుట హాజరు పరచనున్నట్లు తెలిసింది. కాగా, రైల్వే శాఖకు చెందిన సామగ్రిని మూడు నెలలుగా గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా తరలించి, గుజరీకి అమ్మి జల్సా చేసిన రైల్వే ఉద్యోగితో పాటు కూలీలను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన ఆర్పీఎఫ్‌కు చెందిన ప్రత్యేక బృందానికి అవార్డులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

కమనీయం .. శ్రీవారి కల్యాణం



శ్రీవారితో కల్యాణానికి బాలికను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం



పాల్గొన్న విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

- విశిష్ట సంప్రదాయం ప్రకారం బాలికతో వివాహం

రాయదుర్గం: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. విశిష్ట సంప్రదాయం ప్రకారం బాలికతో శ్రీవారికి కల్యాణం జరిపించారు. పట్టణంలోని కోట ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. పద్మశాలీయ వంశం అరవ తెగకు చెందిన పన్నెండేళ్ల బాలికతో శ్రీనివాసుడి కల్యాణం జరిపితే.. ఆ బాలికకు సకల గుణ సంపన్నుడు భర్తగా వస్తాడని భక్తుల నమ్మకం. ఈ ఏడాది అరవ స్వప్న, జనార్దన దంపతుల మూడో సంతానమైన వైశాలిని వధువుగా నిర్ణయించారు. అరవ తెగ కులదైవం భక్త మార్కండేయుని ఆలయం వద్దకు వేంకటేశ్వరుడు చేరుకున్నాక, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వధువు ఇంటికెళ్లి సంప్రదాయబద్ధంగా తీసుకొచ్చారు. తాంబులాలు మార్చుకుని వేంకటేశ్వరుడితో కలిసి బాలికను పెళ్లి మంటపం వరకు మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ భారీ ఊరేగింపుతో చేర్చారు. అభిజిత్ లగ్నంలో సరియగు ముహూర్తానికి శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరుడితో బాలిక మెడలో తల్లి చేత పసుపుతాడు కట్టించగా కల్యాణ ఘట్టం ముగిసింది. ఈ వేడుకలను తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వధూ వరుల తరపు ఎవరెవరంటే...

శ్రీవారి కళ్యాణోత్సవ వేడుకలను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులు, వారి కుమార్తె స్రవంతిరెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. పెళ్లి కుమారుడైన వేంకటేశ్వరుడి తరపున విప్ కాపు, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, పెళ్లి కుమార్తె తరపున కాపు భారతి, ఆలయ కమిటీ చైర్మన్ పాలాక్షిరెడ్డి, కూన నాగప్ప, శివప్ప, పొరాళ్ల శివ ఉండి కార్యక్రమాలు చేపట్టారు. వీరితో కలిసి వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఈఓ నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఆలయ కమిటీ సభ్యులు అక్షితలు వేశారు. భక్తులకు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి స్వగృహంలో కేకేటీ వెంకటేశులు, బీఎస్‌టీ తిప్పేస్వామి సహకారంతో 4వేల అన్నమయ్య లడ్డూలను తయారు చేయించి పంచి పెట్టారు.

రేపు బ్రహ్మరథోత్సవం

ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం 11 గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు తెలిపారు.